
# కాంగ్రెస్‌కు నై.. కాసానికి జై



## బీసీలపై వివక్షత చూపుతున్న కాంగ్రెస్ నేతలను నమ్మేది లేదు

## బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కే తమ మద్దతు అంటున్న బీసీ నేతలు

కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బీసీలు అధోగతి పాలవ్వడం ఖాయమని బీసీ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. కాంగ్రెస్ హయాంలో బీసీలపై కొనసాగిన వివక్షతను ఈ సందర్భంగా బీసీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మారడం తప్పితే.. రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సాకుతో కాంగ్రెస్ నేతలు తమ అహంకారపూరిత మాటలతో బీసీల ఐక్యతను దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కులహంకారంతో మాట్లాడుతున్న నేతలకు వత్తాసు పలికితే రాబోయే రోజుల్లో బీసీ వర్గాలకు ఎదురయ్యే పరిస్థితులు ఇప్పుడే కండ్ల ముందర కదలాడుతున్నాయని ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీసీల సత్తా చూపిద్దామని పిలుపునిస్తున్నారు. బీసీల ఐక్యతకు కృషి చేస్తున్న బీసీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు బీసీలంతా మద్దతుగా నిలిచి గెలిపించుకుంటే బీసీలోని అన్ని కులాలకు సముచిత న్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు. **- రంగారెడ్డి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ)**

### బీసీ నేత గెలుపునకు కృషి చేయాలి



చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తాం. కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి బీసీల సత్తా చాటుతాం. ఎన్నికల సమయంలో బీసీలను పావులుగా వాడుకొని అధికారం దక్కించుకుంటున్న నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెబుతాం. అందుకు ప్రతి బీసీ బిడ్డ ఓ సైనికుడై బీసీ నాయకుడి గెలుపునకు కృషి చేయాలి.

**-వెంకటేశ్ ముదిరాజ్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్**

### అహంకారులకు ఓటుతో బుద్ధి చెప్పాలి



బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బీసీలకు తగు న్యాయం చేసేందుకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు అధికంగా సీట్లు కేటాయించడం సంతోషంగా ఉన్నది. అగ్రకులాల నేతలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు. అహంకారంతో మాట్లాడే నాయకులకు ఓట్లతో బుద్ధి చెప్పాలి. బీసీలు ఐక్యతను చాటి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి.

**- రాజు, నారాయణదాస్‌గూడ గ్రామం, చేవెళ్ల మండలం**

### బీసీలకు అండగా నిలువాలి..



చేవెళ్ల పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న బీసీ నాయకుడు కాసాని జానేశ్వర్ ముదిరాజ్‌కు బీసీలందరూ మద్దతు తెలుపాలి. బీసీ అభ్యర్థిని గెలిపిస్తే పార్లమెంట్‌లో తమ సమస్యలు పరిష్కారమవుతాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి రెండుసార్లు రెడ్డీలకు అవకాశం ఇచ్చి గెలిపిస్తే పార్టీలు మారారు. అలాంటి వ్యక్తులు మళ్లీ పోటీ చేస్తున్నారు. వారికి ఓటు ద్వారా బీసీలు బుద్ధి చెప్పాలి.

**- ఆనేగౌని సంధ్యాదామోదర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ, కందుకూరు**

### కాసాని విజయం ఖాయం..



పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగురవేస్తాం. బీఆర్‌ఎస్ పార్టీలో కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపిస్తే పార్టీలు మారారు. రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డిలను నమ్మి మోసపోవద్దు. కాసాని జానేశ్వర్ గెలుపు ఖాయం. కాంగ్రెస్, బీజేపీ నేతలు బీఆర్‌ఎస్ పార్టీపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో బీజేపీ ప్రజలను మోసం చేసింది. ఇంటింటికీ తిరిగి బీసీ నేత కాసాని విజయం కోసం కృషి చేస్తాం.

**- సామ ప్రకాశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కందుకూరు**

### బీసీల ఓట్లే అధికం ..



బడుగు బలహీన వర్గాలను అణగదొక్కేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన సమయం వచ్చింది. ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉన్నది. కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇచ్చి గౌరవించారు. కాంగ్రెస్ వక్రబుద్ధికి గుణపాఠం చెప్పాలి. బీసీల ఓట్లే అధికంగా ఉన్నాయి.

**- అనిల్, బురాన్‌పల్లి, వికారాబాద్**

### బీసీలం మరింత బలపడుతాం ..



జనాభాలో బీసీల శాతం ఎక్కువగా ఉన్నా బీసీలకు సరైన న్యాయం జరుగడంలేదు. చేవెళ్ల గడ్డపై బీసీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటే బీసీలం మరింత బలపడుతాం. ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తూ తక్కువ శాతం జనాభా ఉన్నవారు రాజ్యాధికారం చేపడుతున్నారు. ఈసారి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని బీసీల సత్తా చాటుదాం.

**- అనిల్, వికారాబాద్**

### బీసీల గళం వినిపించాలి



బీసీల గళం పార్లమెంటులో వినిపించేందుకు ఒక మంచి అవకాశం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కల్పించారు. చేవెళ్ల పార్లమెంటు జనరల్ స్థానంలో బడుగు వర్గాల గొంతుకగా, బీసీ కులాలన్నింటినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం సంతోషకరం. పార్లమెంటు పరిధిలోని మెజార్టీ బీసీ ఓటర్లు అభ్యర్థికి మద్దతు ప్రకటించాలి.

**- పి.మాణిక్యం, మాజీ ఎంపీటీసీ, మిట్టకోడూర్, పరిగి మండలం**

### బీసీలు ఐక్యతను చాటాలి..



బీసీలంతా ఐకమత్యంతో ముందడుగు వేసి భవిష్యత్‌లో రాజకీయంగా రాణించాలి. మరింత ఐక్యతను చాటి పార్టీలకతీతంగా వెనుకబడిన వర్గాల అభ్యర్థులను బలపరచాలి. చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని బీసీ బిడ్డ కాసానికి బీఆర్‌ఎస్ ఇవ్వడం హర్షణీయం. ఇతర ఏ పార్టీలూ ఈ వర్గాన్ని గుర్తించలేదు. ఎన్నికల్లో బీసీలంతా బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసానిని అధిక మెజార్టీతో గెలిపించుకుని సత్తా చాటుదాం.

**- జిల్లా గణేశ్, పద్మశాలీ సంఘం నేత**

### తగిన గుణపాఠం చెప్పాలి



బీసీలంతా ఐక్యంగా ఉండి పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలి. బీసీలను హేళనగా మాట్లాడుతున్న వారికి తగు గుణపాఠం నేర్పాలి. రాజకీయాల్లో రాణించాలంటే బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి అండగా నిలువాలి. బీసీల ఐక్యతపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలకు దీటుగా సమాధానం చెప్పాలి.

**- ఎల్లం నాయుడు**

### బీసీల సత్తా చాటుదాం..



బీసీల ఓట్లను తమ నాయకుడికే వేసి బీసీల సత్తా చాటుదాం. బీసీలను తక్కువ చేసి మాట్లాడుతున్న వారికి ఓటుతో బుద్ధి చెబుతాం. బీసీలను గుర్తించి చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇవ్వడం చాలా సంతోషం. బీసీలకు బీఆర్‌ఎస్ నేత కేసీఆర్ రాజకీయాల్లో సముచితస్థానం కల్పించారు. బీసీలందరం ఏకమై బీసీ నాయకుడిని గెలిపించుకుందాం.

**- అశోక్‌గౌడ్, పెద్దేముల్ గ్రామం**

### భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం..



చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. బీసీ సామాజిక వర్గానికి ఎంపీ టికెట్ ఇచ్చిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేశారు. కాసానిని గెలిపిస్తే సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుంది. బీసీ నాయకుడు కాసానికి ఓటు వేసి గెలిపించుకోవాలి.

**- ఎడ్ల రామచంద్రి, పెద్దేముల్ గ్రామం**

### కలిసికట్టుగా బీసీ నేతను గెలిపించాలి..



వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి టిక్కెట్‌ను బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు కేటాయించింది. ఇన్నాళ్లు అగ్రవర్గాలకు చెందిన నాయకుల గెలుపు కోసం బీసీ నేతలే అహర్నిశలు శ్రమించారు. ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా బీసీ నాయకుడిని చేవెళ్ల గడ్డ నుంచి ఎంపీగా గెలిపించుకోవాలి. ప్రత్యేకంగా బీసీ నేతలు రాజకీయాలను పక్కనబెట్టి విజయమే లక్ష్యంగా పనిచేయాలి. ఐక్యతను చాటి విమర్శకులకు బుద్ధి చెప్పాలి.

**- అంతారం నరేశ్‌కుమార్, అధ్యక్షుడు, బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ**

### కుల అహంకారంతో బీసీల్లో చిచ్చులు..



బడుగు బలహీనవర్గాలకు వచ్చిన అవకాశాలన్నీ గెలుపు దిశగా సాధించేందుకు ఐక్యతగా ముందుకు సాగాలి. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మోహన్‌రెడ్డి లాంటి నాయకులు చాలా గ్రామాల్లో తమ కుల అహంకారంతో బీసీల్లో చిచ్చులు రేపుతూ ఓట్ల రాజకీయాలు చేస్తుండ్రు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలోని పల్లెల్లో అగ్రవర్గీయులు కులాల మధ్య గొడవలు సృష్టించి ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు యత్నిస్తుండ్రు. ఇప్పుడు బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఓటువేసి గెలిపించుకొని తమ బలాన్ని నిరూపించుకోవాలి.

**- కుమార్, మణికొండ**

### బీసీలతోనే అన్ని వర్గాల సంక్షేమం..



పార్లమెంటు ఎన్నికల్లో బీసీలందరూ ఒకే వేదికగా నిలువాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా బీసీల ఐక్యతపై కొందరు అసత్య ఆరోపణలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. బీసీలు పార్లమెంటులో అడుగుపెడితే మరింత అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం సాధ్యం. ప్రతిఒక్కరూ కంకణబద్ధులై పనిచేసి కాసాని జ్ఞానేశ్వర్ విజయానికి కృషి చేయాలి.

**- ఆర్.శ్రీశైలం, పరిగి మండల బీసీ యువత ఉపాధ్యక్షుడు**



వాకర్స్‌ను కలిసి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

# రాగిడిని భారీ మెజార్టీతో గెలిపించాలి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 23 : ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం ఉదయం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ఆటోనగర్ మహవీర్ హరిణ వనస్థలి వాకర్స్‌ను బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆటోనగర్ హరిణ వనస్థలి పార్కులో వాకర్స్ కోసం తాగునీటి సౌకర్యం, ఓపెన్ జిమ్ సౌకర్యం కల్పించామని, పిచ్చి మొక్కలను కూడా తొలగిస్తామని తెలిపారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మల్కాజ్‌గిరిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, అందుబాటులో ఉండి పనులు చేస్తానని తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, లక్ష్మారెడ్డి, వాకర్స్ ప్రతినిధులు సునీల్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలారెడ్డి

**బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం**

ఎల్బీనగర్ , ఏప్రిల్ 23 : పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజ్‌గిరి స్థానంలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సతీమణి దేవిరెడ్డి కమలారెడ్డి అన్నారు. గడపగడపకు బీఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా మల్కాజ్‌గిరి పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ నాగోలు డివిజన్ శివపురి కాలనీలో దేవిరెడ్డి కమలారెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాగోలు డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి, శిల్పారెడ్డి, కవిత, రంజిత్ గౌడ్, శ్రీధర్ గౌడ్, ఉమ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 'కాసాని' నామినేషన్‌కు తరలిన నాయకులు

బడంగ్‌పేట, ఏప్రిల్23: చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. మహేశ్వరం, తుక్కుగూడ, జల్‌పల్లి, మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నామినేషన్ ప్రక్రియ ర్యాలీలో పాల్గొన్నారు.



కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమానికి నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**కందుకూరు నుంచి..**

కందుకూరు. ఏప్రిల్ 23 : చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ కార్యక్రమానికి మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. రాజేంద్రనగర్‌లోని తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. పార్టీ మండలాధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి. పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, ఎంపీటీసీలు సురేశ్, కాకి రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, యూత్ నాయకులు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, గుయ్యని సామయ్య, బర్కం వెంకటేశ్, ప్రశాంత్‌చారి, మాజీ సర్పంచ్‌లు, డైరెక్టర్లు పొట్టి ఆనంద్, సామ ప్రకాశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న నాయకులు

# శోభాయమానంగా శోభాయాత్ర

- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్/మహేశ్వరం/మలక్‌పేట, జోన్ బృందం, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతి సందర్భంగా ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట నియోజకవర్గాల్లో హనుమాన్ ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయాల నుంచి బైక్ ర్యాలీలు నిర్వహించారు. యువకులు జైశ్రీరాం, జై భజరంగ్ నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి 8 గంటలకు వనస్థలిపురంలోని రామాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర రెడ్ వాటర్ ట్యాంకు, ఎన్జీవోస్ కాలనీ, వైదేహినగర్ మీదుగా సాహెబ్‌నగర్ త్రినేత్రాంజనేయ దేవస్థానం వరకు చేరుకుంది. కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం నుంచి వీహెచ్‌పీ ఆధ్వర్యంలో, మోహన్‌నగర్ హనుమాన్ దేవాలయంలో, మలక్‌పేట బీ-బ్లాక్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, అక్బర్‌బాగ్‌లోని హరిహర క్షేత్రం శ్రీమైసమ్మ దేవాలయం, జైలు గార్డెన్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



శోభాయాత్రకు ముందు కుటుంబంతో కలిసి వనస్థలిపురంలోని రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



హనుమాన్ జయంతి సందర్భంగా కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం ఎదుట నుంచి వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ

# ఓటు హక్కు వినియోగించుకోవాలి

కందుకూరు. ఏప్రిల్ 23 : అరాచక శక్తులపై అప్రమత్తంగా ఉండాలని కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ మక్బూ జానీ తెలిపారు.పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని దాసర్లపల్లి, దెబ్బడగూడ, అన్నోజిగూడ, గూడూరు, కటికపల్లి, లేమూరు గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. డబ్బు, మద్యం పంపిణీ చేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సైదులు, సీఐఎస్‌ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టరు రాజేశ్ మీనా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, సీఐ మక్బూల్ జానీ



## ముత్యాలమ్మ అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం

అంబర్‌పేట, ఏప్రిల్ 23 : శ్రీ ముత్యాలమ్మ విగ్రహ శిఖర పునఃప్రతిష్ఠ మహోత్సవం నేపథ్యంలో ఆలయ కమిటీ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు అమ్మవారికి 108 కలశాలతో విశేష అభిషేకం చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు దేవరుప్పల నరసింహ, రమేశ్, ఆంజనేయులు, శ్రీనివాస్, అంజయ్య, బాలకృష్ణ, రాజలింగం, వీరస్వామి పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బండారి



ఉప్పల్, ఏప్రిల్ 23: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, సాయిజెన్ శేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు బహుమతులు ప్రదానం

రామంతాపూర్, ఏప్రిల్ 23: ఆంగ్లనాటక పితామహుడు షేక్స్‌పియర్ జయంతిని ఉప్పల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించి పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంజుల, సుచరిత, వెంకటేశ్వర్లు, మురళి, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేఆర్ భవన్‌లో ఆధార్ కేంద్రం పునఃప్రారంభం

ఆర్కేపురం, ఏప్రిల్ 23 : కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆధార్ కేంద్రం మళ్లీ అందుబాటులోకి వచ్చిందని ఆధార్ సెంటర్ నిర్వాహకులు బాలరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఇక్కడ ఉన్న ఆధార్ సెంటర్ పనిచేయలేదని, మళ్లీ అధికారుల కృషితో బీజేఆర్ భవన్‌లో ఆధార్ సెంటర్‌ను పునః ప్రారంభించామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం నంబర్ 9293786007 ను సంప్రదించాలని కోరారు.